క్లుప్తంగా

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

యడ్లపాడు: విద్యుత్ మరమ్మతుల కారణంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో డీఈఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొండవీడు, స్పైసెస్ పార్కు సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు ఉన్నందున పుట్టకోట, కోట, సొలస, లింగారావుపాలెం, చెంఘీజ్‌ఖాన్‌పేట, వంకాయలపాడు గ్రామాలలో గృహ, వాణిజ్య, పరిశ్రమ, వ్యవసాయానికి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

యాచకులకు రగ్గులు పంపిణీ



యడ్లపాడు: నరేంద్ర సువర్ణకుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 16వ నంబర్ జాతీయ రహదారి పక్కన యాచకులకు వస్త్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహిళా విద్యకు తన జీవితాన్ని అంకితం చేసిన త్యాగమయి సావిత్రి బాయిఫూలే జయంతిని పురస్కరించుకుని ఈ సేవా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఫౌండేషన్ ప్రతినిధులు వెల్లడించారు. తిమ్మాపురం గ్రామం నుంచి కాటూరి వైద్యశాల వరకు హైవేకు ఇరువైపులా ఉన్న యాచకులు, అనాధలు, నిరుపేదలకు రగ్గులు, అల్పాహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షులు సువర్ణకుమారి, వై.ప్రసాదరావు, ఉపాధ్యక్షుడు కె.శిల్ప, కార్యదర్శి వై.అనిల్, సురేష్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో ఐఐటీ ఒలంపియాడ్ పరీక్షలు



చిలకలూరిపేట: గణిత శాస్త్రవేత్త రామానుజన్ జయంతి మ్యాట్రిక్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో శనివారం ఐఐటీ మ్యాథ్స్ ఒలంపియాడ్ పోటీ పరీక్షలు జరిగాయి. పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ పరీక్షలకు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మ్యాట్రిక్ ఒలంపియాడ్ అధినేత రామిరెడ్డి పర్యవేక్షించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ సూర్యతేజ, హనుమంతరెడ్డి, పరీక్షల నిర్వహణకు సహకరించిన వివిధ పాఠశాలల ప్రతినిధులు వెన్నెల, జరుగుల ప్రసాదరావు, కాకుమాను అంజనరావు, సురేష్‌బాబు, సిబియాబ్రంలను అభినందించారు.

విద్యార్థుల ప్రగతిపై దృష్టి సారించాలి



చిలకలూరిపేట: విద్యార్థుల ప్రగతిపై తల్లిదండ్రులు దృష్టి సారించాలని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కె.సుధ చెప్పారు. పాఠశాలలో శనివారం ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎంసీ కమిటీ సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంపునకు కృషి చేయాలని చెప్పారు. విద్యార్థులు పోషక విలువలు కలిగిన మధ్యాహ్న భోజనం తినే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పి.నరేంద్ర, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్, ఉపాధ్యాయులు పోటు శ్రీనివాసరావు, ఎ.నీలిమా, ఎస్.అంజమ్మ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థులు రామిరెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీవాణి



నాదెండ్ల: నిత్య జీవితంలో సినిమా స్టార్స్‌ను కాకుండా పేదలకు సాయమందించే దాతలను ఆదర్శంగా తీసుకోవాలని, అలాంటి దాతల్లో నడికట్టు రామిరెడ్డి ముందువరుసలో ఉంటారని చిరుమామిళ్ల ఏపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ ఝాన్సీవాణి చెప్పారు. చిరుమామిళ్ల నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నడికట్టు రామిరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను శనివారం నడికట్టు రామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. సభకు హెచ్ఎం పి. సుందరరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కరిముల్లా, లైసెన్స్‌డ్ ఇంజినీర్ల అసోసియేషన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి, రెడ్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి, గ్రామపెద్దలు ఈవూరి వెంకటరెడ్డి, ఫాదర్ మర్రిరెడ్డి, ఐనవోలు రాధ, భవనం శ్రీనివాసరెడ్డి, యన్నం శివారెడ్డి, దొండేటి అప్పిరెడ్డి, పిచ్చిరెడ్డి పాల్గొన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్యారమ్స్ పోటీల్లో సత్తా చూపిన విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకం అందించారు.

ఆరేపల్లి ముప్పాళ్లలో కబడ్డీ.. కబడ్డీ...

- 12 నుంచి ఆరు రోజులపాటు 33వ రైతుమిత్ర జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు
- క్రీడాకారులకు రవాణ, భోజన వసతి ఏర్పాట్లు

ఈపూరు(శావల్యాపురం): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు ముప్పాళ్ల గ్రామం వేదికగా నిలిచింది. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలోని ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్ల గ్రామంలో జాతీయస్థాయిలో కబడ్డీ పోటీలకు నిర్వహిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడలను ప్రోత్సహించేందుకుగాను కబడ్డీ పోటీలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. అదే విధంగా యువకుల్లో ఉత్సాహం కల్గించేందుకు ఈ పోటీలను గ్రామస్తులు, దాతల సహకారంతో 1991 సంవత్సరం నుంచి గ్రామ, మండలస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. 2017 నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలు రైతుమిత్ర కమిటీ సభ్యులు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది కూడా ఈనెల 12 నుంచి 17 వరకు పోటీలు నిర్వహించడానికి కమిటీ సభ్యులు రంగం సిద్ధం చేసింది.



విజేతలకు కప్‌ను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు (ఫైల్)

15 రాష్ట్రాల నుంచి 50 జట్లు రాక

జాతీయస్థాయి పోటీలకు 15 రాష్ట్రాల నుంచి 40 నుంచి 50 జట్లు వరకు పాల్గొంటారని వీరందరికీ ప్రయాణ ఖర్చులు, భోజన వసతి ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, రెండో బహుమతి రూ.2 లక్షలు, మూడో బహుమతి రూ. లక్ష నగదు బహుమతులు అందజేస్తామన్నారు. నాల్గవ బహుమతి రూ. 70 వేలు, అయిదో బహుమతి రూ. 50 వేలు, ఆరో బహుమతి రూ. 40 వేలు, ఏడో బహుమతి రూ. 20 వేలు, వరుసగా తొమ్మిది నుంచి 12 వరకు ఎంపికైన ఒక్కో జట్టుకు రూ.15 వేలు అందజేస్తామన్నారు.

ఇవే కాకుండా బెస్ట్ రైడర్ బెస్ట్ డిఫెండర్, మ్యాన్ ఆఫ్‌ది టోర్నీ, మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్ బహుమతులు ఉంటాయన్నారు. జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 99819 22533, 9966671306 సెల్ ఫోను నంబర్లు సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

గ్రామంలో క్రీడా పండుగ



సంక్రాంతి పర్వదినం సందర్భంగా రైతుమిత్ర కమిటీ సభ్యులు గ్రామస్తులు దాతలు సహకారంతో కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నాం. 33వ రైతుమిత్ర జాతీయస్థాయి కబడ్డీ ఓపెన్ టోర్నమెంట్ పోటీలు సందర్భంగా ఏర్పాట్లు కమిటీ సభ్యుల పర్యవేక్షణలో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. 2017 నుంచి జాతీయస్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించాం. ఈ పోటీలను తిలకించడానికి క్రీడాభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం వల్ల గ్రామంలో పండుగ వాతావరణం ఏర్పడుతుంది. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ పోటీల నిర్వహణకు సిద్ధం చేశాం.

–తల్లపనేని రామారావు, రైతుమిత్ర ప్రతినిధి

యాజమాన్య పద్ధతులతో కత్తెర పురుగు నివారణ

వ్యవసాయ శాస్త్రవేత్త నగేష్



రొంపిచర్ల: పల్నాడు ప్రాంతంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పైరుకు కత్తెర పురుగు సర్వసాధారణమైందని లాం శాస్త్రవేత్త డి. నగేష్ అన్నారు. మండల కేంద్రమైన రొంపిచర్ల పరిసర ప్రాంతాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పైరును ఆయన శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ మొక్కజొన్న పంటను కత్తెర పురుగు బారి నుంచి రక్షించుకోవాలంటే రైతులు విత్తనం విత్తే మొదలు పంట కండె దశకు వచ్చేంతవరకు సమగ్ర యాజమాన్య పద్ధతులతో పాటు సస్యరక్షణ చర్యలు పాటించటం ప్రధానమన్నారు. పంటలో ఐదు శాతం మొక్కలకు ఈ పురుగు ఆశిస్తే ఐదు శాతం వేపగింజల కషాయం లేదా 10 వేల పీపీఎం వేప నూనెను పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి, డీడీఏ శివకుమారి, వ్యవసాయ సహాయ సంచాలకులు పి. మస్తానమ్మ, పలువురు వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

వీధి కుక్కపిల్లకు శస్త్ర చికిత్స

- రోడ్డు ప్రమాదంలో గాయపడిన శునకం
- వైద్యులను అభినందించిన స్థానికులు
- బ్లూక్రాస్ సొసైటీ సభ్యులకు అప్పగింత

చిలకలూరిపేట: వీధికుక్కకు ఏమైతే మాకేంటీ అనుకోలేదు వారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న కుక్క పిల్లకు సర్జరీ చేసి ప్రాణం పోశారు. శనివారం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి విలవిల్లాడుతున్న కుక్కపిల్లను ఓ గుర్తు తెలియని వ్యక్తి చిలకలూరిపేట పశువైద్యశాల ప్రాంగణంలో వదిలి వెళ్లాడు. ఉదయం విధులకు హాజరైన ఆసుపత్రి వైద్య సిబ్బంది కుక్కపిల్ల కోసం ఎవరూ రాకపోవడంతో దానికి శస్త్ర చికిత్స చేయాలని నిర్ణయించుకున్నారు. ఇక్కడ కుట్లు వేసే దారాలు, డ్రస్సింగ్ మెటీరియల్ పశువైద్యశాలలో అందుబాటులో లేకున్నా, మెడికల్ షాపు నుంచి సొంత డబ్బులతో తెప్పించి చికిత్సకు పూనుకున్నారు. పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు పసుమర్రు పశువైద్యశాల వైద్యురాలు పి.దీప్తి గంటన్నర శ్రమించి శస్త్ర చికిత్స పూర్తి చేశారు. కుక్కపిల్లకు ముందువైపు తీవ్రంగా గాయాలైన రెండు కాళ్లల్లో ఎడమవైపు కాలిని మోకాలి వరకు తొలగించారు. కుడికాలుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. కోలుకుని లేచాకా ఆలనాపాలన కోసం బ్లూక్రాస్ సొసైటీ సభ్యులకు అప్పగించారు. సర్జరీలో పశువైద్యశాల ల్యాబ్ టెక్నీషియన్ ప్రవల్లిక పాల్గొన్నారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు వైద్యులను అభినందించారు.



కుక్కపిల్లకు శస్త్ర చికిత్స నిర్వహిస్తున్న పశువైద్యులు డాక్టర్ పి.శ్రీనివాసరావు

దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలకు ఎంపిక

నరసరావుపేట రూరల్: దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయ క్రికెట్ పోటీలకు కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. ఈనెల 3వ తేదీన ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ఎంపిక పోటీలలో కళాశాలకు చెందిన జి.ప్రవీణ్‌కుమార్ పాల్గొని బౌలింగ్ విభాగంలో ప్రతిభ కనబర్చి వర్సిటీ జట్టుకు ఎంపికైనట్టు తెలిపారు.

ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలోని మద్రాస్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే దక్షిణ భారత అంతర్ విశ్వవిద్యాలయం క్రికెట్ పోటీలలో వర్సిటీ జట్టుకు ప్రవీణ్ కుమార్ ప్రాతినిథ్యం వహిస్తారని వివరించారు. వర్సిటీ జట్టుకు ఎంపికైన ప్రవీణ్ కుమార్‌ను కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్ సతీష్, వ్యాయామ అధ్యాపకుడు ఈదర ఆదిబాబులు అభినందించారు.



ప్రవీణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు

ఈశ్వర్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు

నరసనరావుపేటరూరల్: ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఎక్స్‌ల్లార్ ఎడ్యుటెక్ సంస్థ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.నాగమల్లేశ్వరరావు శనివారం తెలిపారు. కంపెనీ హెచ్ఆర్ ఆర్.అవినాష్ కార్యక్రమంలో పాల్గొని కంపెనీ విధి, విధానాలు పవర్ పాయింట్ ద్వారా తెలియజేశారు. అనంతరం నిర్వహించిన ఎంపికలో కళాశాల ఈఈఈ, ఈసీఈ, సీఎస్ఈ విద్యార్థులు 90 మంది పాల్గొన్నారు. ఆన్‌లైన్ పరీక్షలో 57 మంది అర్హత సాధించారు. గ్రూప్ డిస్కషన్‌లో 21 మంది ఎంపికవ్వగా ముఖాముఖి ఇంటర్వ్యూలో ఏడుగురు విద్యార్థులు ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఎంపికైన విద్యార్థులకు రూ.3.5 లక్షల వార్షిక ఆదాయం లభిస్తుందని, ఫిబ్రవరి 25లో ఉద్యోగాలలో జాయిన్ అవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి షేక్ కరీమ్ మొహిద్దీన్, మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ షేక్ మస్తాన్ షరీఫ్, ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ షేక్ నజీమ, ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ షేక్ ముజీర్, అధ్యాపకులు అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో కళాశాల కార్యదర్శి షేక్ కరీమ్‌మొహిద్దీన్

జూనియర్ కళాశాల కొనసాగేలా చూడాలి

- ఎమ్మెల్యే ప్రత్తిపాటికి విద్యార్థుల వినతి
- వేర్వేరు ప్రాంతాల్లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం

యడ్లపాడు: సుదీర్ఘ కాలం తర్వాత వైఎస్సార్ సీపీ హయాంలో యడ్లపాడు మండలానికి జూనియర్ కళాశాల ఏర్పాటుకు మోక్షం కలిగిందని దీనిని ఇలాగే కొనసాగించాలంటూ హైస్కూల్ ప్లస్-2 విద్యార్థినులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావుకు వినతి అందించారు. శనివారం నుంచి ఇంటర్ విద్యార్థులకు కూడా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పథకాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు తాము ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ యడ్లపాడు హైస్కూల్ ప్లస్ విద్యార్థినులకు వచ్చే విద్యా సంవత్సరంలో అన్ని సౌకర్యాలను కల్పించే విధంగా కృషి చేస్తామన్నారు. హైస్కూల్ హెచ్ఎం జి విజయభారతి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో యడ్లపాడు ఎంఈవో 1,2లు నాగరత్నం, అరుణకుమారి, తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎస్ఎం చైర్మన్ రిహానా, టీడీపీ మండల అధ్యక్షుడు కామినేని సాయిబాబు, నాయకులు రాఘవయ్య, పోపూరి వెంకటరత్తయ్య, వెంకయ్య, జనసేన నాయకులు తోట రాజారమేష్, పాల్గొన్నారు.

అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు

చిలకలూరిపేట: అనధికార లే అవుట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని శారదా జెడ్పీహైస్కూల్లో మధ్యాహ్న భోజన పథకం లాంఛనంగా ప్రారంభించిన అనంతరం విలేకర్లతో మాట్లాడారు. అనధికార లే అవుట్ల విషయాన్ని శుక్రవారం మంగళగిరిలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగిన ప్రాంతీయ రెవెన్యూ సదస్సులో మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. నిబంధనలు గాలికి వదిలి ఇష్టానుసారం వేసిన లే అవుట్లు కట్టడి చేసేలా త్వరలోనే ప్రభుత్వం జీవో తీసుకురానుందని వెల్లడించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.



ఎమ్మెల్యే పుల్లారావుకు వినతి పత్రం అందిస్తున్న విద్యార్థినులు

మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభం

వినుకొండ(నూజెండ్ల): ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ప్రభుత్వ చీఫ్‌విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి జీవీ భోజనం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

బొల్లాపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం శనివారం ప్రారంభించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం జరిగిందని పథకాన్ని ప్రారంభిస్తూ ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవో పి.సీతారామయ్య తెలిపారు.

ప్రారంభ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ శిఖా జ్యోత్స్న, మాజీ సర్పంచ్ షేక్ ఖాశీం, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రసన్న, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు ఉన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

శావల్యాపురంలో...

శావల్యాపురం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో ఇంటర్ చదువుతున్న విద్యార్థినులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఈవో-2 పుసులూరి లలితకుమారి పథకాన్ని ప్రారంభించి మాట్లాడుతూ నూతనంగా ఇంటర్మీడియట్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించటం అభినందనీయమని, మెనూ ప్రకారం పోషకాలు కల్గియున్న ఆహారాన్ని విద్యార్థులు భుజించి ఆరోగ్యం, ఉల్లాసంగా ఉంటూ మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాగసిరి చెన్నమ్మ, ప్రధానోపాధ్యాయులు బొడ్డపాటి విజయలక్ష్మి, విద్యా కమిటీ చెర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, స్టాఫ్ సెక్రటరీ బెజవాడ వెంకట నాగేశ్వరరావు, కామినేని లక్ష్మీ నారాయణ, కనగాల వెంకట మోహన్‌చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాదెండ్లలో....

నాదెండ్ల: ఇంటర్ విద్యార్థులకు శ్రీమతి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం అమలు చేయటం హర్షణీయమని గోల్కొండ గ్రూపు సంస్థల ఛైర్మన్, విద్యాదాత నడికట్టు రామిరెడ్డి చెప్పారు. చిరుమామిళ్ళ ఏపీ మోడల్ పాఠశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఎంఈవో కృష్ణారెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

నోబుల్ టీచర్స్ క్యాలెండరు ఆవిష్కరణ

శావల్యాపురం: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర క్యాలెండరును ఎంఈవో పుసులూరి లలితకుమారి అవిష్కరించారు. శనివారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల్లో నూతన క్యాలెండరు ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించటంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి, ఎఎమ్‌సీ చైర్మన్ పాటిబండ్ల శ్రావణ్‌కుమార్, కేవీఆర్ మోహన్‌చందు, ఉపాధ్యాయులు శ్రీకాంత్ నిర్మల, భువనేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వరవకట్టలో పోలీసు కార్డన్ సెర్చ్

- పత్రాలు లేని 33 వాహనాలు, ఆటో స్వాధీనం
- నేరాల నియంత్రణలో భాగంగా తనిఖీలు

నరసరావుపేటటౌన్: వరవకట్ట ప్రాంతంలో శుక్రవారం అర్ధరాత్రి వన్‌టౌన్ పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేని 33 ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నారు. కార్డన్‌సెర్చ్‌లో భాగంగా తనిఖీలు చేపట్టారు. వన్‌టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో టూటౌన్, రూరల్, ట్రాఫిక్ పోలీసులు నాలుగు బృందాలుగా విడిపోయి అనుమానిత గృహాలు, ప్రదేశాలల్లో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ఎం. విజయ్‌చరణ్ శనివారం మాట్లాడుతూ ఇటీవల వరవకట్ట ప్రాంతానికి చెందిన కొంత మంది యువకులు అక్రమంగా గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డారన్నారు. అదే విధంగా చోరీ చేసిన ద్విచక్ర వాహనాలు కలిగి ఉన్నారన్నారు. దాడుల్లో 33 ద్విచక్ర వాహనాలను, ఆటోను స్వాధీనం చేసుకున్నామన్నారు. సంబంధిత వాహన యజమానులు పత్రాలు చూపించి వాహనాలు తీసుకెళ్లాలన్నారు. లేని పక్షంలో వాహనాలను కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. వరవకట్ట ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం ఉందన్నారు. అలాగే కొంత మంది చోరీ చేసిన వాహనాలు కలిగి ఉన్నట్లు తెలిసిందన్నారు. వీటన్నిటిపై విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో వన్‌టౌన్ ఎస్ఐ అరుణ, టూటౌన్ సీఐ హైమారావు, ట్రాఫిక్ సీఐ లోకనాథం, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

సంక్షిప్త వార్తలు

■ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రాణి

రొంపిచర్ల: రొంపిచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొనకంచివారిపాలెం గ్రామానికి చెందిన మొండితోక రాణిని ఎంపిక చేశారు. రొంపిచర్ల మార్కెట్ యార్డు ఎస్సీ మహిళకు రిజర్వ్ అవ్వటంతో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఈమె పేరును ప్రతిపాదించారు. రాణి సంతగుడిపాడు గ్రామానికి గతంలో ఎంపీటీసీగా కూడా పనిచేశారు. రాణి భర్త రొంపిచర్ల మండల ఎంపీపీగా పనిచేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా రాణిని ప్రతిపాదించటంతో రామారావు, వారి అనుచరులు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

■ ఆ.. రేషన్ డీలర్లపై చర్యలు చేపట్టాలి

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని పలువురు రేషన్‌షాపుల డీలర్లు లబ్ధిదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ నాయకులు షేక్ ఫిరోజ్ తెలిపారు. ఏ వార్డు రేషన్‌కార్డులు ఆ వార్డుకే అంటూ కొందరు రేషన్ డీలర్లు ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. వృద్ధులు, మహిళలు, వికలాంగులు అందుబాటులో ఉన్న రేషన్ షాపు వద్దకు వెళ్లి సరుకులు ఇవ్వాలని అడిగితే మీ కార్డు ఇక్కడ కాదు, ఇక్కడ చెల్లదు అంటూ పంపుతున్నారన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

■ పెట్రోలు బంకు త్వరలో ప్రారంభిస్తాం

శావల్యాపురం: మండలంలోని గుంటుపాలెం-కారుమంచి గ్రామాల ప్రధాన కూడలి మార్గంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోలు బంకు పనులు పూర్తి అయినాయని కారుమంచి సొసైటీ సీఈవో వైవీ నారాయణ శనివారం తెలిపారు. కారుమంచి సొసైటీ సారథ్యంలో రూ. 50 లక్షల వ్యయంతో చేపట్టిన పెట్రోలు బంకు పనులకు సంబంధించి జిల్లా కలెక్టరు నుంచి అనుమతులు మంజూరయ్యాయని త్వరలో ప్రారంభోత్సవం చేస్తామన్నారు. పెట్రోలు బంకు ప్రారంభోత్సవం అయితే చుట్టుపక్కల గ్రామాలకు చెందిన రైతులకు వాహనదారులకు సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రజలు తెలిపారు.

■ విద్యతోనే ఉన్నతావకాశాలు

యడ్లపాడు: విద్యతోనే విద్యార్థి జీవితం సమాజంలో ఉన్నతంగా తీర్చిబడుతుందని ఎంఈవో నాగరత్నం చెప్పారు. యడ్లపాడు నారాయణ ఇంగ్లీష్ మీడియం స్కూల్ 19వ పాఠశాల వార్షిక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపాల్ చెరుకూరి సృజన పాఠశాల ప్రగతి నివేదికను చదివి వినిపించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మరో అతిథి పోపూరి గంగయ్య చౌదరి ఈ విద్యసంస్థలో చదివిన వారెందరో పలు రంగాల్లో ఉన్నతస్థాయిలో రాణించడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్, సెక్రెటరీ పోపూరి వెంకటేశ్వర్లు, పోపూరి బ్రహ్మానందం పాల్గొన్నారు.

■ స్టడీ మెటీరియల్‌తో మంచి ఫలితాలు సాధించాలి

శావల్యాపురం: పదోవ తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకోని మంచి ఫలితాలు సాధించాలని గంగినేని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు గంగినేని రాఘవరావు అన్నారు. శనివారం మండలంలోని మతుకుమల్లి, పోట్లూరు, వేల్పూరు గ్రామాల్లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదోవ తరగతి విద్యార్థులు స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కృష్ణతులసి, సింగంశెట్టి అన్నపూర్ణమ్మ, మాజీ సర్పంచ్ ముంద్రు హనుమంతరావు, ఎంపీపీ స్కూలు విద్యాకమిటీ చైర్మన్ పులుకూరి శ్రీనివాసరావు, వెంకటరావు, అనిల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన డీఏవో

రొంపిచర్ల: స్థానిక మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయ అధికారి ఐ. మురళి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు మార్కెట్ యార్డుకు తెచ్చి ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. నిబంధనలకు అనుగుణంగా రైతులు పండించిన ధాన్యాన్ని అంతటిని కొనుగోలు చేయటం జరుగుతుందన్నారు. ధాన్యంలో 17 శాతం నెమ్ము ఉండాలన్నారు. అలాగే రైతులు తమకు దగ్గర్లో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. నమోదు ఆధారంగా ఆయా రైతుల నుండి కొనుగోలు చేస్తారన్నారు.

■ తాగునీటి పథకాన్ని పరిశీలించిన జెడ్పీ సీఈవో

నరసరావుపేట రూరల్: జొన్నలగడ్డ తాగునీటి సరఫరా పథకాన్ని శనివారం జెడ్పీ సీఈవో జ్యోతిబసు పరిశీలించారు. చెరువును, ఫిల్టర్ బెడ్‌లను, మోటర్స్ గదిని పరిశీలించి సిబ్బందిని అడిగి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీటి శ్యాంపిల్స్ సేకరించి క్లోరినేషన్ శాతాన్ని పరిశీలించారు. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేసేలా ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాషా, ఈవోపీఆర్‌డీ నాగానంద్, ఎంఆర్‌సీ అయ్యపరెడ్డి, పంచాయతీ కార్యదర్శి శైలెంద్ర, కార్యాలయ ఈవో పేరిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అపర్ణ, జూనియర్ అసిస్టెంట్ రమాదేవి, టైపిస్ట్ రజని పాల్గొన్నారు.

పథకాల ప్రయోజనాలతో అభివృద్ధి

బొల్లాపల్లి: పేదలు ఆరోగ్యం, ఆర్థికపరమైన పథకాల ద్వారా ప్రయోజనం పొందాలని ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐటీసీ స్వచ్ఛంద సంస్థ బంగారు భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా సెర్ప్ సంస్థ ఆరోగ్య బీమా, ఆర్థిక అక్షరాస్యతపై పలు శాఖల సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో వీరయ్య, సెర్ప్ సంస్థ ప్రతినిధులు సతీష్, ఏసోబు, క్లాప్ మిత్రలు తదితరులు పాల్గొన్నారు.

■ వచ్చినవి 183 అర్జీలు పరిష్కారమైనవి 86

నాదెండ్ల: గ్రామ రెవిన్యూ సదస్సులకు మొత్తం 183 అర్జీలు అందినట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. డిసెంబర్ 6న సాతులూరులో ప్రారంభమై జనవరి 3న చందవరంతో ముగిశాయన్నారు. పదకొండు రెవిన్యూ సదస్సులు జరగ్గా 183 అర్జీలు అందాయన్నారు. ఇప్పటికే వీఆర్వోలు, సర్వేయర్లు సమన్వయంతో 86 అర్జీలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు.